# విలువ

నాకు వివాహం జరక్కుండా వుంటే నాకిద్దరాడపిల్లలు పుట్టకుండా వుంటే, వాళ్ళకి చదువులంటట్లేదని వాళ్ళమ్మ కంగారుపడిపోకుండా వుంటే, నాకు సావిత్రితో పరిచయం అయ్యుండేది కాదు.

పిల్లలిద్దరూ బొత్తిగా చదవటంలేదని, ఎవరినైనా ట్యూషన్ పెట్టమన్న మా యావిడ పోరు భరించలేక ఒకరోజు వాళ్ళ స్కూలుకెళ్ళి, వాళ్ళ టీచర్ని అడిగాను ట్యూషను చెప్పటానికి వీలౌతుందా అని.

ఆవిడ మాడిపోయినా మినపరొట్టెలా వుంది. కాసేపు వగలు పోయింది. తనను మళ్ళీ జన్మలో ఇంకెవ్వరూ అడగటానికి రారన్నట్టుగా, తనకున్న మోజంతా తీర్చుకోవాలన్నఆశతో, కుర్చీలో నిగడతన్నికూర్చుంది. నా వంక ఎగాదిగా చూసింది. తర్వాత పైకప్పు వంక చూసింది. ఆటుపిమ్మట తను ధరించిన కలంకారీ చీరని పరీక్ష చేసుకుంది. ఆపైన మెల్లిగా అంది.

నాకు వీలుపడదండీ- ఈవినింగ్స్ చాలా బిజీ. అయినా మీ పిల్లల ట్యూషను అరేంజి చేస్తాను- రోజూ ఎవరో ఒక ఆడపిల్ల టీచరు వుద్యోగం కావాలని తిరిగిపోతోంది. కావాలంటే ఆ అమ్మాయిని పంపిస్తాను, ఆమెకి కాస్త హెల్ప్ చేసినట్లుగా వుంటుంది ఏమంటారు ?

నేను "అబ్బే అలాకాదండి - మీరే రావాలి- ప్లీజ్" అంటానని ఆశించినట్లుగా వున్నాయ్ ఆమె చూపులు.

కాని నేను "తప్పక ఆమెనే పంపండి" అనేసి వచ్చేశాను.

సరిగ్గా రెండ్రోజుల తర్వాత, నేనప్పుడే ఆఫీసు నుంచి వచ్చి ఆ రోజు పేపరు చూస్తూ కూర్చున్నాను.

"నమస్కారమండీ" ఆ మాట విని తలెత్తి చూసాను.

ఒక యువతి మొహంనిండా దైన్యాన్ని పులుముకొని నిలబడుంది. వయస్సుపాతికవైలయిపు వుండవచ్చు. ఆమె కష్టాలన్నీ నాకు ఆమె కళ్ళకింద నల్లటిచారల్లో కన్పించాయ్. ఆమె ధరించిన నాసిరకం చీరఆమెయౌవ్వనాన్ని దాచలేకపోతోంది. కాళ్ళకి అరిగి పోయిన చెప్పులు, చేతికున్న మట్టి గాజులు, మెళ్ళో వెలవెలాపోతున్న గిల్టు గొలుసు, ఆమె ప్రస్తుత పరిస్థితికి దర్పణం పట్టి చూపిస్తున్నాయి.

తనని తాను సావిత్రిగా పరిచయం చేసుకుంది.

ఆ క్షణంలోనే ఆమెందే నాకు కొంత గౌరవం ఏర్పడింది. ఆమె బ్రతుకుతో చేస్తున్నపోరాటం, పాటిస్తున్న క్రమశిక్షణ నన్నాకట్టుకున్నాయి.

రోజూ వేళ తప్పకుండా ట్యూషన్‌కి రావటం, శ్రద్ధగా పాఠాలు చెప్పటమే కాకుండా, నాభార్యతో కలివిడిగా మాట్లాడటం, తన కష్టసుఖాలన్నీ మాకు చెప్పుకోవటంతో, సావిత్రి మాకు ఎంతో ఆప్తురాలైంది.

చాలా కొద్ది రోజుల్లోనే సావిత్రి మా ఇంట్లో మనిషిలా కల్సిపోయింది.

తనకి అవసరం వచ్చినప్పుడల్లా పదీ పరకా అడుగుతుండేది. నేనూ కాదనకుండా, లేదనకుండా యిస్తూవుండేవాడిని.

ఇది ఇలా వుండగా, ఒకరోజు నేనప్పుడే బజారునుంచి వచ్చి కూర్చున్నాను. నా భార్య శ్రావణ మంగళవారం పేరంటానికి కెళ్ళింది.

సావిత్రి అప్పుడే ట్యూషన్ పూర్తిచేసింది. పిల్లలిద్దరూ రివ్వున వీధిలోకి పరిగెత్తారు.

సావిత్రి మెల్లిగా నావద్ద కొచ్చి నిలబడింది. మళ్ళీ ఏదైనా అవసరం వచ్చిందేమో, అడగటానికి సందేహిస్తోందని తలచి మెల్లిగా పలకరింపుగా, అనునయంగా అన్నాను 'ఏం సావిత్రి' అని.

సావిత్రి నావంక దీనంగా చూసింది. ఏదో చెప్పబోయి సందేహిస్తున్నట్లుగా వుంది.

రెండు క్షణాలు ఆలోచించి మెల్లిగా అంది "రాత్రి ఎనిమిది గంటలకి కోవెల ప్రక్కనున్న మర్రి చెట్టువద్ద కొస్తారా? మీతో పనుంది."

ఆ మాట విన్న నేను ఆశ్చర్యపోయాను.

ఏమిటీ ఆమె వుద్దేశ్యము? నాతో ఏమైనా సంబంధం పెట్టుకోవాలనుకుంటుందా? నేనలాటి మనిషిలా కన్పించానా? లేక నా ప్రవర్తన వల్ల ఎన్నడైనా ఆ భావన కల్గించానా? ఇన్నాళ్ళుగా ఆమెకి సహాయం చెయ్యటం ఆ వుద్దేశ్యంతో అనుకుంటోందా? కేవలం మానవత్వం వల్లేనని తెలీదా?

నేను ఇతమిద్ధంగా ఎటూ తేల్చుకోలేకపోయాను ఆ క్షణంలో.

మనిషినిచూస్తే ఆ రకం మనిషిలా కన్పించటం లెదు. కాని మరి ఇదేమిటి?

రాత్రి పూట వూరి బయటకి రమ్మంటే-తనని కల్సుకోమంటే ఏమనుకోవాలి? జీతం పెంచమని అడగటానికని ఎలా సరిపెట్టుకోను.

నేను ఆలోచన్లోంచి తెరుకొనేసరికి సావిత్రి లేదు.

నేనలా ఆలోచిస్తూనే వున్నాను చాలా సేపు. తర్వాత ఒక నిర్ణయానికొచ్చాను.

ఎనిమిదింటికి ఆమె రమ్మన్న స్థలాని కెళ్ళాలి. ఆమె వుద్దేశ్యం తెల్సుకోవాలి.

రాత్రికి తర్వగా భోజనం ముగించి, స్నేహితుడింటి కెడుతున్నానని ఇంట్లో అబద్ధం చెప్పి బయల్దేరాను.

మెల్లిగా నడుస్తున్నాను. కాని ఆలోచనలు తెమలటం లేదు.

కోవెలనిదాటి మర్రిచెట్టుని సమీపించి, సిగరెట్ తీసి వెలిగించాను.

ప్రక్కనే పారుతున్న కాలవ నీటి గలగల శబ్దం తప్ప అక్కడ ఎటువంటి సందడి లేదు!

నేనలాగే నిలబడి, నాకే తెలినీ వుద్వేగంతో ఎదురుచూడ సాగాను సావిత్రి కోసం.

సావిత్రి వుండటం ఎక్కడో, ఎటువైపునుంచి వస్తున్నదో గూడా తెలీదు.

కాలవ ఆవలివొడ్డునించీ బల్లకట్టు వస్తున్నట్లుగా, దాన్ని నడిపేవాడి పల్లె పదాలు వినిపిస్తున్నాయ్.

అయిదునిమిషాల్లో బల్లకట్టు ఒడ్డును తాకింది.

అప్పుడు చూసాను సావిత్రిని!

నాలోని ఉద్వేగాన్ని, ఆత్రుతని పటాపంచలుచేస్తూ, మెల్లిగా వస్తోంది, బల్లకట్టు దిగి - వస్తున్న ఆమెనిచూసి మరింత ఆశ్చర్యపోయాను - కారణం ఆమెచేతి పొత్తిళ్ళలో ఒక నెలల బిడ్డతో పాటుగా రావటం.

నాకేం బోధపడలేదు. అలాగే స్థాణువులా నిలబడి చూడసాగాను.

నన్ను గుర్తించిన సావిత్రి చకచక నన్ను సమీపించి "వచ్చారా! నాకు తెలుసు వస్తారని. ఇదిగో ఈ పిల్లాడిని పట్టుకోండి. అవతల ఒడ్డున గుడ్డల మూటను మర్చిపోయాను. పది నిముషాల్లో వచ్చేస్తా, పిల్లాడు జాగ్రత్త" అనేసి ఎంత వేగంగా వచ్చిందో అంత రెట్టింపు వేగంతో వెళ్ళిపోయింది.

నేనాశ్చర్యంతో బిగుసుకుపోయాను. నోట్లోంచి మాట రాలేదు. నేను తేరుకుని మామూలు మనిషినయ్యే సరికి సావిత్రిని తీసుకుని బల్లకట్టు కాలువ మధ్య భాగానికెళ్ళింది.

మళ్ళీ నిరీక్షణ! మళ్ళీ ఆలోచన్లు!

ఎవరీ పిల్లాడు! సావిత్రికి పెళ్ళయిందా! మరి పెళ్ళికాలేదని అబద్ధ మెందుకాడింది? అన్నీ ప్రశ్నలే!

మరి పదినిమిషాల్లో బల్లకట్టు మళ్ళీ ఈ ఒడ్డుకొచ్చింది.

కాని సావిత్రి జాడలేదు! అంటే ఇంక రాదా?

నాకు భయం వేసింది. ఆ ఆలోచన నన్ను కంపిచేసింది. అంత చల్ల గాలి వీస్తున్నా నా శరీరం సెగలు కక్కింది. బల్లకట్టు మనిషి పెద్దగాఅరుస్తు న్నాడు. "ఇయాల్టికి చివరి ట్రిప్పు బాబయ్యా! వచ్చేదుంటే లగెత్తుకు రండి" బహుశా నన్నుద్దేశించే అయ్యుంటుంది.

నాలో ఆలోచనలు రేసుగుర్రాల్లా పరిగెత్తుతున్నాయి సావిత్రి ఎందుకిలా చేసింది? ఈ పిల్లాడిని నాకే ఎందుకిచ్చింది? ఆమె వుద్దేశ్యం ఏమై వుంటుంది? ఇపుడు నా కర్తవ్యం ఏమిటి?

మొదటిసారిగా పిల్లాడివంక చూసాను.

వెన్నెల్లో టమాటో పండులా వున్నాడు. చలికోటుగాని, వూలుటోపీ గాని లేవు. సాధారణమైన చొక్కా, చలిగాలి తగలకుండా తలకుకట్టిన పాత గుడ్డ తప్ప మరింకేమీలేవు నా చేతిలో పడుకున్న ఆ పిల్లాడికి.

కాని చాలా ఆకర్షణీయంగా వున్నాడు.

ఏం చెయ్యాలి? ఇంటికి తీసికెడితే నా భార్యకేం చెప్పాలి? ఏదైనా చెప్పినానమ్ముతుందా? అసలెందుకు చెప్పాలి! ఈ పిల్లాడిని ఇక్కడే ఒదిలేసి వెళ్ళిపోతే?

అలా పిల్లాడిని చేత్తో పట్టుకుని, ఆ వెన్నెట్లో ఎంతసేపు నిల్చున్నానో నాకే తెలీదు.

బాగా ఆలోచించిన మీదట వాడిని ఇంటికి తీసికెళ్ళటానికి నిర్ణయించాను.

ఒకవేళ నా భార్య ఒప్పుకోకపోతే, తర్వాత మెల్లిగా ఎక్కడైనా అనాధాశ్రమంలో చేర్పించాలని నిశ్చయించి, పిల్లాడితో సహా ఇంటిదారి పట్టాను -

కాని ఎన్నడూ లేనిది ఆ క్షణాన సావిత్రిని నాలో నేనే దూషించాను-కోపగించుకున్నాను.

నేను భయపడినంతగా గొడవేం జరగలేదు ఇంట్లో మాకు ఇద్దరూ ఆడపిల్లలు కావటంతో, మొగపిల్లాడని, అదీ పౌర్ణమినాడు వచ్చాడని సంబరపడిపోయింది పిచ్చి ఇల్లాలు! నే చెప్పిన కట్టుకథ నమ్మేసింది.

చంద్రశేఖర్ పేరుపెట్టుకుని నేనాశించిన దానికంటే రెట్టింపు ఆప్యాయతతో పెంచసాగింది -

నా మనసు కుదటపడింది. నాకో తృప్తి లభించింది.

ఇదంతా జరిగిన నాల్రోజులకి, నేను ఆఫీసునించి వచ్చేసరికి ఒక వుత్తరం వుంది టేబుల్ మీద.

అది సావిత్రి రాసింది! ఆత్రంగా చదివాను.

— గార్కి

నమస్కారములు, మొన్నరాత్రి నేచేసిన పనికి క్షమించండి. తప్పని పరిస్థితుల్లో ఆ నిర్ణయం తీసుకున్నాను. క్లుప్తంగా నా గూర్చి చెప్పుకుంటాను. నేనొక వంచితని. మగవాడి మాటలువిని మోసపోయినవారిలో నేనూఒకదాన్ని మీ వద్దనున్న పిల్లాడు ఆ తొందరపాటు ఫలితమే! జీవితంలో నిలబడాలని, కష్టాల్తో పోరాడాలని శతవిధాలుగా ప్రయత్నించాను. కాని లాభం లేక పోయింది. బీదరికం ఒకవైపు, ఒంటరితనం ఇంకోవైపు నన్ను పీల్చి పిప్పి చేశాయ్. పతితనన్న భావన నన్ను కాలేస్తోంది. అందుకే మిమ్మల్ని ఇబ్బంది పెట్టాల్సివచ్చింది.

నీ పిల్లాడిని నాకే ఎందుకు అప్పగించాలని మీరడగొచ్చు, మీ చేతుల్లో, మీ నీడలో నా బాబుకి ఎటువంటి భయం వుండదన్ననమ్మకం నాకు కల్గింది. మీలో మానవత్వం వుంది. నా కష్టాల్ని చూసి జాలిపడ్డ మీరు, మీ చేతుల్లో వుంచిన ప్రాణిని విసిరివెయ్యరని వాడిని పెంచి పెద్దచేసి, మనిషిగా మీలాగా తయారుచేస్తారన్న ఆశతోనే కాదు - దురాశతోనే వెడుతున్నాను.

ఎక్కడికి అని అడక్కండి - నాకే తెలీదు. మీకేంచెప్పను.

కాని మిమ్మల్ని మళ్ళీ కలవనని హామీయిస్తున్నాను. చివరిగా ఒక్క విన్నపం- నా బాబుకి, నా గూర్చి ఎప్పుడూ ఎట్టిపరిస్థితుల్లోనూ చెప్పొద్దు ఏ క్షణాన వాడిని మీ చేతుల్లో వుంచానో, ఆ క్షణంనించి వాడు మీ పిల్లాడే!

వాడి భవిష్యత్తుకి బంగారు బాటలు వేస్తారో - వాడిచేత బండరాళ్ళే మోయిస్తారో అంతా మీయిష్టం.

- సావిత్రి

చదవటం పూర్తిచేసిన నా కళ్ళలో నీళ్లనిండాయ్. గుండె బరువెక్కింది ఆ పుత్తరాన్ని పదిలంగా దాచాను - ఎవ్వరికి కన్పించకుండా.

x x

దాదాపు ఇరవై సంవత్సరాలనాడు జరిగిన ఈ సంగతులన్నీ నాకీనాడు గుర్తువచ్చి వుండకపోను, కాని కొన్ని క్షణాల క్రితం జరిగిన సంఘటన నాలో ఎక్కడో లీలగా గుర్తున్న సావిత్రి స్వరూపాన్ని దీనంగా నిలబెట్టినట్టయింది.

చంద్రం వచ్చిన క్షణంనుంచీ మా పరిస్థితి మారిపోయింది. దావాలో వున్న ఆస్తి యావత్తూ నా వశం కావటం ఆ యావదాస్తిని అమ్మేసి నేను వ్యాపారంలోకి దిగటం కలలాగ జరిగిపోయింది.

మనిషి దశ తిరిగితే స్వల్పకాలంలో ఎలా పైకొస్తాడన్నదానికి నా జీవితమే సాక్ష్యం.

వందలు చల్లి వేలు పండించాను. అవి లక్షలయి కూర్చున్నాయ్.

పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. ముగ్గురికి మంచి చదువులు చెప్పించాను.

నాకిప్పుడు ఎటువంటి చీకులూ చింతలూ లేవు.

ఆ రోజు సాయంత్రం నేను డ్రాయింగ్ రూములో కూర్చుని పుస్తక పఠనంలో మునిగున్నాను.

ఆడపిల్లలిద్దరూ వాళ్ళమ్మతో సినిమా కెళ్ళారు.

చంద్రం వాడి ఫ్రెండ్ కోసం క్రింద "లాన్" లో ఎదురుచూస్తున్నాడు. వున్నట్లుండి నాకు క్రిందనించి కేకలు విన్పించాయ్ వాటితోపాటుగా ఎవరో ఆడమనిషి ఏడుస్తున్న శబ్దం -

చంద్రం బిగ్గరగా ఎవరిమీదో అరుస్తున్నాడు.

నేను కంగారుపడి బాల్కానీలో కొచ్చాను.

అక్కడ కన్పించిన దృశ్యం నేనెన్నడూ మర్చిపోలేనిది - నన్ను అమితంగా కలవరపెట్టింది.

ఓ ఆడ మనిషి పాతికేళ్ళలోపు వయస్సుంటుంది. నిలబడి ఏడుస్తోంది. ఆమె ప్రక్కన ఒక చేట, దానికి కాస్త దూరంలో మట్టి ముద్దలాంటి పిల్లాడు గుక్కలు పెట్టి ఏడుస్తున్నాడు.

చంద్రం కోపంగా అరుస్తున్నాడు. నాకు పరిస్థితి అర్థం అయింది. చకచకా మెట్లు దిగి కింది కెళ్ళాను.

నాలో ఇన్నాళ్ళు గుప్తంగా దాగున్న కోపం నరనరాల్లోకి ప్రాకి నన్ను పున్మత్తుడిని చేసింది.

చంద్రాన్ని సమీపించి ఆవేశంగా అడిగాను "ఏమైంది"? అని.

చంద్రం తనని తాను సమర్థించు కుంటున్నట్లుగా "చూడు డాడీ- ఈ మనిషి అడుక్కోటానికని వచ్చింది. లేదంటే పోదు- డెవిల్, ఒక్క తోపు తోసాను. అంతే" అన్నాడు చాలా తేలిగ్గా.

ఆడమనిషి కన్నీళ్ళతో "చూడయ్యా ఆకలి బాధ, పొట్టతిప్పలు! పిల్లగాడికి రెండ్రోజులుగా అన్నం లేదు బాబూ- అడిగానని ఎలా తోసే సిందు బాబూ" అంటూ వంగి పిల్లాడిని మళ్ళీ చేటలో పడుకోపెట్టుకుని, చేటని చేతిలోకి తీసుకుంది.

నాకు కోపాన్ని ఆపటం శక్యం కాలేదు, "యూ బ్రూట్! కమ్‌హియార్, కమ్ విత్‌మీ" అంటూ వాడి చెయ్యి పట్టుకుని బరబరా పైకి లాక్కెళ్ళాను.

ఏం చేస్తున్నానో నాకే తెలీటంలేదు.

చంద్రం "అదికాదు డాడి, వాళ్ళకి వీళ్ళకీ కన్నపిల్లల్ని అడ్డం పెట్టు కుని వ్యాపారం చేస్తారట వీళ్ళు- యూ డోంట్‌నో డాడీ- దె ఆర్ రోగ్స్" అంటున్నాడు.

"షటప్!" అని ఎక్కడో పదిలాంగా దాచిన సావిత్రి రాసిన వుత్త రాన్ని వాడి చేతులో కుక్కి "యూ రీడిట్- ఫూల్" అన్నాను.

చంద్రం బిత్తరపోయాడు. వాడి ఇరవై ఏళ్ళ ప్రాయంలో ఎన్నడూ అంత కోపాన్ని నాలో చూసుండడు- అందుకే చాలా కంగారు పడిపోయాడు.

గబగబా వుత్తరాన్ని చదివాడు. మెల్లిగా అన్నాడు. "వాట్ డాడి? ఎవరీ సావిత్రి! ఈ పిల్లాడెవరు! ఈ ఉత్తరాన్ని నాకెందుకు చూపిస్తున్నారు?"

ఆ వుత్తరాన్ని వాడి చేతుల్లోంచి లాక్కుని, దాన్ని గాల్లో వూపుతూ, కోపంగా అరిచాను. "ఆ సావిత్రి నీ తల్లిరా! ఎవరికో కన్న - నిన్ను పెంచలేక, పురిట్లోనే చంపలేక, నా చేతుల్లో పెట్టింది. నిన్ను పెంచాను. చదువు చెప్పించాను, మనిషివయ్యావని సంతోషించాను, కాని నువ్వు మానవత్వంలేని మనిషివయ్యావని ఇప్పుడే తెల్సింది - నేతి బీరకాయలో నెయ్యి! యూ రాస్కెల్! ఆనాడు నిన్ను నేను అక్కడే వదిలేస్తే నీ బతుకేమయ్యేది? అలాగే నువ్వుకూడా చేటలో పడుకుని వూరేగేవాడివి. ఈ రోజున ఇలా వున్నావంటే కారణం- మానవత్వం! అది లేనివాడు మనిషికాడు- జస్ట్ యానిమల్, గెటవుట్" కసికొద్దీ వుత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చించి విసిరేశాను.

ఆవేదన, కోపం, జాలీ, ఓటమి తాలూకు బాధలన్నీ చుట్టుముట్టగా, కుర్చీలో కూలబడ్డాను.

చంద్రం కాళ్ళకి చుట్టుకొని "సారీ డాడీ - రియల్లీ సారీ డాడీ - క్షమించండి" అంటున్నాడు.

కాని నాకేమీ విన్పించటం లేదు.

కదలకుండా అలాగే కూర్చుండిపోయాను.

(స్నేహ మాసపత్రిక, జూన్, 1979)

# వెరీ సింపుల్...

ఒక ప్రఖ్యాత సినీకథా రచయితని, మరో ప్రఖ్యాత సినీ జర్నలిస్టు ఇంటర్వ్యూ చేస్తున్నాడు

'మీరు సినిమాల్లోకి రాక ముందు ఏంచేసే వారు?'

'దర్జీ పన్చేసే వాడిని'

'మీరు కథ సమకూర్చిన తొలి చిత్రమేది?'

'ప్రేమ పిలికలు...'

'దర్జీ పన్చేసుకునే మీకు కథల్చెప్పటం ఏలా అలవాటైంది?'

ఓ... అదా... వెరీ సింపుల్... నే ప్రతి రోజు రాత్రి బాగా ప్రొద్దుపోయాక ఇంటికి చేరుతుండేవాడిని. మా ఆవిడ గడప లోనే నిలేసి కారణం అడిగేది. ప్రతి రోజు ఏదో ఒకటి చెబుతుండేవాడిని. అలా అలా అలా.........